క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ

నర్మెట : నూతన తహసీల్దార్‌గా పారునంది శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. గత కొంత కాలంగా డీటీ బైరెడ్డి రాజేష్‌రెడ్డి తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జనగామ కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణాధికారిగా పనిచేస్తున్న శ్రీనివాస్ తహసల్దార్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, బొమ్మకూర్ సర్పంచ్ బానోత్ శంకర్ నాయక్, నాయకులు నరహరి, మల్లేశం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

సద్వినియోగం చేసుకోవాలి



దేవరుప్పుల : అంగన్‌వాడీ కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బస్వ సావిత్రి సూచించారు. శుక్రవారం మండలంలోని సీతారాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డిరాజుల రమేష్, సరిత, యాకుబ్‌పాషా, అన్నపూర్ణ, సువర్ణ, యాకమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట : మండలంలోని నారాయణపురంలో ఇటీవల మృతి చెందిన గొల్ల అశోక్ కుటుంబ సభ్యులకు రూ.2,500ల ఆర్థికసాయాన్ని సర్పంచ్ మాసపేట రవీందర్‌రెడ్డి అందించారు. శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు పరిదె సత్తయ్య, రవి, మల్లయ్య, నర్సింహులు ఉన్నారు.

నేడు జోడో యాత్ర

బచ్చన్నపేట : కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ హాథ్‌సే హాథ్ భారత్ జోడో యాత్రకు మద్దతుగా శనివారం మండల కేంద్రంలో జోడో యాత్రను చేపట్టనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు వంచ వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ యాత్రను టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య చేపడుతున్నారన్నారు. ఉదయం కొడవటూర్‌లోని సిద్దేశ్వరాలయంలో పూజలు నిర్వహించి కొడవటూర్, బండనాగారం, లక్ష్మాపూర్, బోనకొల్లూర్, కేసిరెడ్డిపల్లి, బసిరెడ్డిపల్లి గ్రామాల్లో యాత్రను నిర్వహిస్తామన్నారు. యాత్రకు నాయకులు, కార్యకర్తలు, పాల్గొనాలని కోరారు.

సొసైటీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లావాదేవీల్లో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాపోలు పృథ్వీ శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం లేదని, మక్కలు, ధాన్యం కొనుగోళ్ల ద్వారా వచ్చిన లావాదేవీల్లో అక్రమాలు జరిగాయన్నారు. అలాగే దేవాదుల కాల్వ కింద పోయిన సొసైటీ భూమికి వచ్చిన పరిహారం విషయం గోప్యంగా ఉంచారన్నారు. వీటిపై వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. అలాగే జనగామ డీసీఓకు వినతిపత్రం అందజేసినట్లు పృథ్వీ తెలిపారు.

బహుమతుల అందజేత

జనగామ రూరల్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ధర్మకంచ పాఠశాలలో విద్యార్థులు వ్యాసరచన, క్విజ్, ఉపన్యాసం పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నీరజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారకులైన వారిని శిక్షించాలి

తరిగొప్పుల : మెడికో విద్యార్థిని ప్రీతి మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌టీపీ మండల నాయకుడు తలకొక్కుల రవి డిమాండ్ చేశారు. గ్రామశాఖ అధ్యక్షుడు ఎర్రవెల్లి బాలయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మండలకేంద్రంలోని దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఎదుట కొవ్వొత్తులతో ప్రీతి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంజిరెడ్డి, భాస్కర్, వెంకట్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్, చక్రపాణి, రాములు పాల్గొన్నారు.

సామర్థ్యాన్ని పెంపొందించాలి



జఫర్‌గఢ్: చదువులో విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని నోడల్ ఆఫీసర్ ఎండీ.పర్వేజ్ కోరారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమంపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కరోనా సమయంలో విద్యార్థులు చదువులో వెనుకబడి ఉన్నారన్నారు. ప్రభుత్వం చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం గణేష్‌రెడ్డి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



లింగాలఘణపురంలో...



పాలకుర్తిలో..



గ్యాస్ ధరల పెంపుపై బీఆర్‌ఎస్ నిరసన



నర్మెట: చౌరస్తాలో మోదీ దిష్టిబొమ్మ దహనం



బచ్చన్నపేట : రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ల ధరలను పెంచడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జఫర్‌గఢ్, లింగాలఘణపురం, బచ్చన్నపేట, నర్మెట, రఘునాథపల్లి, తరిగొప్పుల, దేవరుప్పుల, కొడకండ్ల మండల కేంద్రాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిలిండర్లను ప్రదర్శిస్తూ బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం పూర్తిగా సంపన్నులకు మేలు చేసేలా పాలన సాగిస్తున్నారన్నారు. బీజేపీ తీరును ప్రజల్లో ఎండగట్టాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

–సాక్షి నెట్‌వర్క్



దేవరుప్పుల: సూర్యాపేట రహదారిపై..



కొడకండ్ల : బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



తరిగొప్పుల : మండలకేంద్రంలో వంటావార్పు చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

చైర్మన్ కృషి అభినందనీయం

చిల్పూరు: ఎన్నడూ లేనివిధంగా ఈసారి నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సకల సౌకర్యాలు కల్పించిన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు కృషి అభినందనీయమని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. మండలంలోని పల్లగుట్టలో శుక్రవారం శ్రీధర్‌రావు నివాసంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కేరళ రాష్ట్రం నుంచి సింగరిమేళం డోలు కళాకారులు, కోయంబత్తూరు నుంచి హనుమాన్ వేషధారణ కళాకారులు, సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి భజన కీర్తన కళాకారులు, జనగాం జిల్లా నుంచి ఒగ్గుడోలు కళాకారులు, మండల కేంద్రానికి చెందిన కోలాట కళాకారులతో పాటు 30 మంది వలంటీర్లు పాల్గొన్నారు. సమావేశంలో మార్కెట్ చైర్మన్ గుజ్జరి రాజు, డైరెక్టర్లు శ్యాంసుందర్‌రెడ్డి, రాజన్‌బాబు, రంగు హరీష్, ధర్మకర్తలు కుమార్, చేరాలు, రవీందర్‌రెడ్డి, సంపత్‌రాజు, పోషయ్య, వీరన్న, గట్టయ్య పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

లింగాలఘణపురం: మండలంలోని రాంచంద్రగూడెం ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రాజయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సర్పంచ్ వాణిసురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఆంజనేయస్వామి ఆలయంలో రాతి ధ్వజస్తంభాన్ని రూ.1.50 లక్షలతో దాత కొత్త బుచ్చిరెడ్డి ఇవ్వగా ప్రతిష్ఠాపన చేశారు. ఆయన వెంట ఎంపీపీ జయశ్రీ, జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, ఎంపీటీసీ సిద్దు, మార్కెట్ డైరెక్టర్ ఆంజనేయులు, నాయకులు నాగేందర్, భాగ్యలక్ష్మి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



లింగాలఘణపురం : ధ్వజస్తంభం వద్ద మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య, తదితరులు

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

నర్మెట : మండలంలోని వెల్దండ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలనా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డీఈఓగా నవీన్, ఎంఈఓగా శ్రీనివాస్, హెచ్‌ఎంగా అశ్విని, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్రా వెంకట్‌రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జఫర్‌గఢ్ : మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ తాటికాయల అశోక్ మాట్లాడుతూ చదువు ద్వారానే అన్ని సాధించవచ్చునన్నారు. ఉత్తమ విద్యాబోధన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నర్మెట : ఉపాధ్యాయులతో విద్యార్థులు..



జఫర్‌గఢ్ : హిమ్మత్‌నగర్ పాఠశాలలో..

క్రైం కార్నర్

కిరాణం షాపులో చోరీ

దేవరుప్పుల : మండలంలోని మాదాపురం రెవెన్యూ పరిధి లాకావత్‌తండాలో భూక్య శాంతి కిరాణం షాపు నడిపించుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసి రూ.లక్ష సొత్తు ఎత్తుకెళ్లారు. రోజువారీగా విధులు ముగించుకొని దుకాణానికి తాళం వేయగా దొంగలు వెంటిలేటర్ పగులగొట్టి దుకాణంలో దూరి సామగ్రితో పాటు నగదు ఎత్తుకెళ్లినట్టు బాధితురాలు వాపోయింది. పోలీసులు ఈ సంఘటనపై ఆరా తీస్తున్నారు.

వీధికుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృతి



దేవరుప్పుల : వీధి కుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన నల్లకుంటతండాలో చోటుచేసుకుంది.తండాకు చెందిన ఈజ్మీరా సోమ్లానాయక్ గొర్రెల కాపలదారుడిగా జీవనం కొనసాగిస్తున్నాడు. రోజువారీగా గొర్రెలను మేపుకొని పాకలో కట్టేయగా శుక్రవారం తెల్లారిసరికే మృతి చెంది ఉన్నాయి. ఇటీవల నల్లకుంట సమీపంలోని దుబ్బగుట్ట ఏరియాలో అడవికుక్కల దాడిలో పాడిపశువు మృతి చెందిన క్రమంలో గొర్రెలు మృత్యువాత పడడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఫౌండేషన్ స్టోన్ పడి విద్యార్థికి గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని సముద్రాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఫౌండేషన్ స్టోన్ ప్రమాదవశాత్తు పడి వీరగోని నితీష్ విద్యార్థి గాయపడిన సంఘటన గురువారం జరుగగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన వీరగోని మంజుల, రాజు దంపతుల కుమారుడు నితీష్ సముద్రాల పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో ఇటీవల కిచెన్‌షెడ్‌ల నిర్మాణం చేపట్టారు. పనులకు సంబంధించిన వివరాలు తెలిపేలా ఏర్పాటు చేసిన ఫౌండేషన్ స్టోన్ పగుళ్ల పడి ఉంది. ఈ క్రమంలో గురువారం పాఠశాల ఆవరణలో ఆడుకుంటున్న విద్యార్థి నితీష్‌పై పడగా వేలికి తీవ్ర గాయమైంది. గమనించిన తోటి విద్యార్థులు పేరెంట్స్‌కు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విద్యార్థికి తీవ్ర గాయాలైనా హెచ్‌ఎం స్పందించడం లేదని బాధితుడి బంధువులు ఆరోపిస్తున్నారు.

పాఠశాల సమయంలో జరుగలేదు – యాదవ శ్రీనివాస్, హెచ్‌ఎం

సంఘటన పాఠశాల సమయంలో జరుగలేదు. ఉదయం 8.30 గంటలకే జరుగగా గమనించిన వారు ప్రథమ చికిత్స చేయించారు. ఈ విషయమై బాధిత విద్యార్థి బంధువులు తనపై అనవసర ఆరోపణలు చేస్తున్నారు.

ఎల్‌ఓసీ అందజేత

తరిగొప్పుల : మండలకేంద్రానికి చెందిన గాజుల సతీష్ సోలార్ విద్యుత్ ప్లాంటులో విధులు నిర్వర్తిస్తూ విద్యుత్ ప్రమాదానికి గురయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం ఆర్థికసాయం కోసం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించిన ఆయన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఆ పత్రాన్ని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి బాధితుడి కుటుంబసభ్యులకు శుక్రవారం అందజేశారు. వారి వెంట నాయకులు జొన్నగోని సుదర్శన్ గౌడ్, అమిరిశెట్టి వీరేందర్, రాజారాం, జైపాల్‌రెడ్డి, భూక్య రవి, తదితరులు ఉన్నారు.

బియ్యం పంపిణీ

బచ్చన్నపేట : మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన గుడుగుల హనుమయ్య మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు బీజేపీ మండల అధ్యక్షులు సోమిరెడ్డి 50 కిలోల బియ్యాన్ని అందించారు. శుక్రవారం వారు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేయాలి

జనగామ రూరల్: గత 23 రోజుల నుంచి దీక్షలు చేస్తుంటే సర్వేల పేరుతో కాలయాపన లేకుండా ఇందిరమ్మ ఇళ్లు అందించాలని 3వ విడత ఇందిరమ్మ సాధన కమిటీ అధ్యక్షుడు కళ్యాణం లింగం అన్నారు. శుక్రవారం ఐలమ్మనగర్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న దీక్షలను వారు ప్రారంభించి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పేదలకు పట్టాలిచ్చారని నాటి నేటికి అద్దె భవనాల్లో ఉంటూ కాలం వెల్లదీస్తున్నారన్నారు.వారికి పనులు దొరకక కిరాయి చెల్లించలేని స్థితిలో ఉన్నారని వెంటనే పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలన్నారు.ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను సర్వే చేస్తామని అనడం మోసం చేయడమే అని అన్నారు. కార్యక్రమంలో శాంతమ్మ, వెంకటలక్ష్మి, కమల, తులసి, యాదమ్మ, వెంకటేష్, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

జఫర్‌గఢ్: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను కూలీలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తాటికాయల అశోక్ కోరారు. మండలంలోని హిమ్మత్‌నగర్‌లో ఉపాధి పనులను ఎంపీటీసీ యార నీలమ్మ సోమిరెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు కూలీలకు ఉపాధి కల్పించేందుకు ఎంతో ఉపయోగపడుతున్నదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

బచ్చన్నపేట: గ్రామ పంచాయల్లో జమ, ఖర్చుల రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, అలాగే గ్రామస్తులకు అన్ని రకాల వసతులు కల్పించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇటుకాలపల్లిలో వన నర్సరీలను పరిశీలించి జీపీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో వంద శాతం మొక్కలను రక్షించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పైన ట్రీగార్డులను వేయాలన్నారు. అలాగే ఇంటి, నల్లా పన్నులను వసూలు చేయాలని జాబ్‌కార్డు కలిగిన వారందరూ ఈజీఎస్ పనులకు వెళ్లాలని సూచించారు . ఆయన వెంట సర్పంచ్ నాగిరెడ్డి రజిత, పంచాయతీ కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



చిల్పూరు: స్థానిక చిల్పూరుగుట్ట శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో జెడ్పీ నిధుల నుంచి మంజూరైన రూ. 5లక్షలతో సీసీ రోడ్డు పనులను జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. సమావేశంలో ఎంపీపీ సరిత బాలరాజు, సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్, ఉపసర్పంచ్ మహేందర్, ఎంపీటీసీలు సాదం నర్సింహులు, అయిలమ్మ, ఆలయ అధ్యక్షుడు నారగోని రాజు, ఉపాధ్యక్షుడు సట్ల లింగయ్య, యువజన సంఘం అధ్యక్షుడు నారగోని రవిచంద్ర,గౌడ సంఘం అధ్యక్షుడు మాచర్ల ప్రవీణ్ పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

రఘునాథపల్లి: స్థానిక శ్రీమహదేవస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఆలయ పూజారి పిండిపోలు శ్రీనివాస్‌శర్మ, జనగామ పూజారి అయ్యప్పశాస్త్రి, ప్రసాద్‌శర్మల మంత్రోచ్ఛరణలతో శివపార్వతుల కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కూరెళ్ల పెద్ద ఉపేందర్‌గుప్తా-రేణుక దంపతుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో బచ్చు చిరంజీవి, మొగుళ్లపల్లి భిక్షపతి, ఓరుగంటి శంకర్‌లింగం, గందె రవి, సోమలింగం, చిన్న ఉపేందర్, విజయ్‌కుమార్, లింగయ్య, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల పక్షపాతి కాంగ్రెస్



స్టేషన్‌ఘన్‌పూర్: బడుగు, బలహీన వర్గాల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ అని పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లొక్కుంట్ల ప్రవీణ్ అన్నారు. కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నూతి శ్రీకాంత్‌గౌడ్ జన్మదిన వేడుకలు మండలంలోని శివునిపల్లిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ ఓబీసీ సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శి కోల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రవీణ్ హాజరయ్యారు. ముందుగా కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతుందన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ విజయ బావుటా ఎగురవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజశేఖర్, వెంకట్‌రెడ్డి, చల్లా తిరుపతి, కోల శ్రీనివాస్, గుర్రం సోమయ్య, సుమన్‌నాయక్, ఎల్లమ్మ, సరోజన, ముక్తీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లు కేటాయించాలని ధర్నా

జఫర్‌గఢ్: అర్హులైన పేదలకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని తమ్మడపల్లి (జి)కి చెందిన మహిళలతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. తొలుత స్థానిక శివాలయం నుంచి డప్పుచప్పుళ్ల మధ్య రెవెన్యూ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ రామారావుకు అందజేశారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి రాపర్తి సోమయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజయ్య గ్రామానికి 500 డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తానని సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే నిలబెట్టుకోలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు గుండెబోయిన రాజు, కాట సుధాకర్, నక్క యాకయ్య, నల్లతీగల శ్రీనివాస్, ఎండీ శభానా, వేల్పుల నాగరాజు, శంషోద్దీన్‌తో పాటు మహిళలు పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



యాగశాలలో పూజ చేస్తున్న అర్చకులు

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక బస్టాండ్‌కు సమీపాన ఉన్న శ్రీ తిరుమలనాథ స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 8 వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతీ రోజు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. దేవస్థాన అభివృద్ధి కమిటీ బాధ్యులు, అర్చకులు, భక్తుల ఆధ్వర్యంలో దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబ్ చేశారు. ప్రధాన ఘట్టమైన కళ్యాణ మహోత్సవం ఈనెల 5న నిర్వహించనున్నట్లు కమిటీ చైర్మన్ కలకోట రంగాచార్యులు, ప్రధాన అర్చకులు కలకోట రామానుజచార్యులు, శేషాచార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపను పొందాలని వారు కోరారు.

ఘనంగా యాగశాల పూజ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవస్థానంలో శుక్రవారం ఘనంగా యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. యాగశాల పూజలను యాగశాల నిర్మాణ దాత, వ్యాపారవేత్త గన్ను శ్రీనివాస్, సునీత దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు కుంభం నరేందర్, మహంకాళీ రవీందర్, నాగబండి వెంకట్రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి

పాలకుర్తి : తెలంగాణ ప్రభుత్వం మహిళల సాధికారత కోసం కృషి చేస్తుందని ఎంపీపీ నల్ల నాగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు గూడూరు, చెన్నూరులో ఐకేపీ ఆధ్వర్యంలో తలపెట్టిన కుట్టుశిక్షణ కేంద్రాల ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంత్రి దయాకర్‌రావు సహకారంతో మూడు నెలల్లో 200 మంది మహిళలకు ఉచిత శిక్షణ ఇచ్చి స్వయం సమృద్ధి సాధించేందుకు తోడ్పాటు అందించారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, డీఆర్‌డీఓ ఏపీడీ నూరొద్దీన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నవీన్, కోఆప్షన్ సభ్యులు మదార్, ఎర్రబెల్లి రాఘవరావు, అశోక్‌రెడ్డి, సర్పంచ్‌లు యాకాంతరావు, మంద కొంరయ్య, పార్వతీ రాజేశ్వర్‌రావు, ఐకేపీ ఏపీఎం రమణాచారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ నాగిరెడ్డి

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చందునాయక్

పాలకుర్తి: కేంద్ర ప్రభుత్వ రైతు, ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాల్సిన అవసరముందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. చందునాయక్ మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర కల్పించే విషయంలో కేంద్రం రైతులను మోసగించిందన్నారు. ఈ నెల 11న పాలకుర్తిలో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తామన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సోమన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమసత్యం, రాజు, రమేష్, రాము, స్వామి, పాల్గొన్నారు.

అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాన్నదానం



జనగామ: అనాథలు, అభాగ్యుల కడుపు నింపడంలో ఉన్న సంతోషం ఎక్కడా దొరకదని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మయ్య అన్నారు. టీడీపీ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామిని హరీష్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని అమ్మఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్టీసీ చౌరస్తాలో మహాన్నదాన కార్యక్రమం నిర్వహిచారు. సమ్మయ్యతో పాటు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారులు వంగ భీమ్‌రాజ్ కోవిడ్ బాధితులకు ఉచిత అంబులెన్స్, ఫ్రీజర్ బాక్సులను అందించి మానవత్వాన్ని చాటుకున్నారన్నారు. నాయకులు పరకాల శ్రీనివాస్ గౌడ్, తాళ్లపల్లి ఎల్లేష్, గుగులోతు కనకరాజు, కొణిదల కిషన్‌ప్రసాద్, సుద్దాల సురేష్, గోళ్ల శ్రీనివాస్ రావు, మున్న, సతీష్ పాల్గొన్నారు.